# పాపాయి నవ్వాలి

ఎడ్లబండిలో రైల్వే స్టేషన్‌కు వచ్చేసరికి కాళిదాసుకి ఒళ్ళు హూనమైనట్లనిపించింది. చంపావురా సన్నాసి. దారి పొడువునా కుదుపులే ఏం రోడ్లు ఏం బురదలు విసుగ్గా అన్నాడు. ఓసోసి! ఏంటి చినబాబు ఇయ్యాల కొత్తగా మాట్లాడుతున్నారు. తమరు పుట్టి పెరిగింది ఇక్కడే గందా! సరేలేరా పెద్ద చెప్పొచ్చావు. నాన్న గొడవతో నెత్తివాచింది. ఇహ నువ్వు కూడా క్లాసు తీసుకుంటే పిచ్చెక్కిపోతుంది. "నా నేటి అన్ను బాబు. కాస్త సదువు ఒంటిపట్టినాక మీకు మానూరంటే ఇసికి పోనాది. పోనీ పెద్ద దొరబాబులా పట్నం వెళ్ళిపోయి ఉద్యోగం చేసుకోండి. అయ్యగారి సెవిలో జోరిగలా పోరెట్టేసి ఉద్యోగం కోసం ఎల్తున్నారుగా. జయం... జయం... సినబాబు మిమ్మల్ని ఎత్తుకుని పెంచిన సేతుల్తోనే దీవిత్తున్న." సన్నాసిగాడి మాటలకి కాళిదాసు అలసట ఆందోళన ఒక్కసారిగా ఎగిరిపోయాయి. వాడి మాట అక్షరాల జరుగుతుంది. ఈ నమ్మకం తను పుట్టకముందు నుంచి ఇంట్లో అందరికీ వుంది. నీ నోటి మాట పొల్లుపోదురా. ఆనందంగా వంద కాగితం సన్నాసి గాడి చేతిలో పెట్టాడు.

ప్రయాణీకుల్ని అందరిని తనలో ఇముడ్చుకుని ముందుకు సాగిపోతుంది ట్రైన్. గర్వంగా సిగరెట్టు కాలుస్తూ పొగ వదల్తున్నాడు కాళిదాసు. ఎదురు సీట్లో పసిపాపను ఒళ్లో వేసుకుని కూర్చున్న శ్యామల ఇబ్బందిగా చూసింది. "సారీ! మీకు పడదులా వుంది. ఏం చేయను ఇది నా హేబిట్" చిద్విలాసంగా నవ్వుతూ శ్యామల నుద్దేశించి అన్నాడు. నాకైతే పర్వాలేదు. దానికి ఈ పొగ అంటుండగా నే... ఆమె ఒళ్లో పాపాయి దగ్గుతూ ఉక్కిరి బిక్కిరైంది. చివాలున లేచి సిగరెట్టును విసరిపారేశాడు. నేనూ హించలేకపోయాను. ఏమనుకోకండి. శ్యామల కుర్చున్న సీటు ఖాళీగా

వుండటంతో ఆమె ప్రక్కనే కూర్చుంటూ అన్నాడు. ఆమె సన్నగా నవ్వింది. అతని నరాలు జివ్వుమన్నాయి. ఆహా! మళ్ళీ కాలేజి రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఈ ప్రయాణం తనకి బోరనిపించదు. వెర్రిమాలోకంలా వుంది. ఈ అమ్మాయి వాలకం. ఎదురు సీటులో కూర్చోవలసిన నువ్వు పక్కకొచ్చి కూర్చున్న చుర్రున చూడలేదు. చిటపటలాడలేదు. "ఒరే కాళీ యు ఆర్ లక్కీ" తనలో తానే మురిసిపోయాడు.

కాళిదాసుకి సహజంగా మీసం మొలుచుకొచ్చినప్పటి నుంచి అమ్మాయిల్ని ఆకర్షించి మాట్లాడే అలవాటుంది. వాళ్ళని ఆటపట్టించటం, ఉడికించటం, ఏడిపించటం విచిత్రమైన సరదాలు. కాలేజీ లైఫ్‌లో అమ్మాయిల్ని ర్యాగింగ్ చేయటంలో అగ్రస్థానం తనదే. చదువు పూర్తయి సొంత గ్రామం వచ్చినప్పటి నుంచి ఈ ఆటలకూ, అల్లర్లకు బ్రేకు పడిపోయింది. ఇప్పుడు రొట్టె విరిగి నేతిలో పడింది. సాదా చీర, ముఖాన ఉందీ లేనంత బొట్టూ, బోసిమెడ అసలు ఈమె ముస్తాబయితేగా, ఉన్న అందాన్ని ఏ ఆడపిల్లయినా వందరెట్లు పెంచుకోవాలని చూస్తుంది. ఏమిటీ పిల్ల? ఏం వయసు ముదిరిపోయిందని ఒళ్ళోపిల్ల, శ్యామలని ఎగాదిగా చూశాడు. చూపులతోనే ఆమె శరీరంలోని సొగసంతా జుర్రేస్తున్నాడు. వెరీ బ్యూటీ మోడ్రన్ డ్రస్ వేసుకుని, హెయిర్ కటింగ్ చేసుకొని తయారైయిందో, సినిమా తారలందరూ బలాదూర్ మగాళ్ళందరి చూపులూ ఈ అమ్మాయి మీదే! తన కాలేజీ లైఫ్‌లో ఇలాంటి సౌందర్యరాశి అబ్బే! తటస్థపడలేదు. అయ్యో ఈ అందమైన ముఖాన చెమట పట్టిందే. కూల్ డ్రింక్స్ అమ్మే వాడికి సైగ చేసి తీస్కొని ఆమెకందివ్వబోయాడు. ఏదో ధ్యాసలో ఉన్న శ్యామల అప్పటి వరకూ కాళిదాసు ప్రవర్తన గమనించలేదు. ఉలిక్కిపడి చూసింది.

"తనెవరూ? తనతో ఈ చనువెందుకు?" కోపంతో శ్యామల ముఖం ఎర్రబడింది. "నాకోసం మీకెందుకు శ్రమ" అనేసింది.

కాళిదాసు ఉత్సాహం నీరు గారిపోలేదు. "అందమైన ఆడపిల్ల ముఖంలో అలసట చూడను నేను. కవ్వించో నవ్వించో వాళ్ళని సంతోష పెట్టేదాకా తోచదునాకు." ప్లీజ్ ఈ కూల్‌డ్రింక్ త్రాగండి.

"నో... థాంక్స్... అపరిచితుల దగ్గర..."

"మీరేం తీసుకోనంటారు" ఆమె మాటలు అతనే పూర్తి చేసి బిగ్గరగా నవ్వాడు. ఇలా బెట్టు చేయడం మొదలెట్టిందే ఈ వయ్యారి. పిచ్చి మాలోకం అనుకుంటే చిచ్చర పిడుగులా ఉంది.

ఛా...ప్చ్... ఏది ఎలా అయినా తను వెనక్కి తగ్గేది లేదు. ఈ ప్రయాణం చివరంటూ ఈ అమ్మాయితో ఎంజాయ్ చేసి తీరతాడు. ధృడంగా అనుకొని...

"ఇంతకీ ఏమిటి మీ సందేహం..." ఈ కూల్ డ్రింక్ మీ ఎదురుగానే కొన్నాను. మన రైల్వే వాళ్ళు ఎనౌన్స్ చేస్తున్నట్లు మీకు ప్రమాదమేం ముంచుకు రాదు, దీన్ని తాగటం వల్ల"

"మీరు అనవసరంగా మాట్లాడుతున్నారు. ఈ ట్రయినెక్కేవరకూ మనం ఒకరినొకరు తెలీదు. మీ తీరు నాకేదోలా వుంది. దయచేసి మీ సీట్లో కెళ్ళి కూర్చోండి. ఏదో వాదులాడుకుంటున్నాం అనుకుని తోటి ప్రయాణీకులు మనల్నే పరిశీలనగా చూస్తున్నారు".

"పసికట్టారు కదా! మానేయండి వాదులాడటం" చొరవగా కూల్‌డ్రింక్ నోటికందిస్తూ "మీరైతే ఏదో లోకంలో ఉన్నారు కానీ ప్రయాణీకులంతా నేను మీకు బాగా కావలసినవాడ్నే అనుకుంటున్నారు. అందరిలో ఆ భావన రావలనే నా ప్రయత్నం" అన్నాడు. ఇక తప్పదని గటగటా తాగేసింది. శ్యామలకంతా అయోమయంగా ఉంది. సవాలక్ష సమస్యలతో తన మనసే చితికిపోయి ఉంటే ట్రయిన్ ప్రయాణంలో ఈ అర్థంలేని గందరగోళం ఏమిటి? ఇతని ప్రవర్తన ఈ పదిమందిలోనూ బయటేస్తే వాళ్ళు అతనికే గడ్డి పెట్టడం ఖాయం. తరువాత తనకి అదీ ఓ తలనెప్పిగా తయారు కావచ్చు. అప్పుడేం చేయాలి? తను మానసికంగా చాలా దెబ్బతింది. ఇంక ఏమీ తట్టుకోలేదు.

"ఊరుకున్న వాళ్ళలో ఊళ్ళుసాల్లేవు" అన్నట్టు తనకి మౌనమే శరణ్యం" శ్యామల కిటికీ వైపు ముఖం తిప్పుకొని బయటకు చూస్తూ కూర్చుంది.

ట్రయిన్ ఒక పెద్ద స్టేషన్‌లో ఆగడంతో బిలబిలా ఆ కంపార్ట్‌మెంట్‌లోకి మరికొందరు ప్రయాణీకులు వచ్చేశారు. తేలుకుట్టిన దొంగలా తన సీటుకెళ్ళి కూర్చున్నాడు కాళిదాసు. ఓ వృద్ధురాలు, నడివయస్కురాలు శ్యామల ప్రక్కనే చేరారు.

"ఇది నీ బెర్తా బాబు, పోనీలే.. చంటిపిల్లతో ఉన్నారు. అమ్మాయికీ నీకూ కింది బెర్త్‌లే వచ్చాయి. వీళ్ళు మా ఆవిడ, నాకూతురు శ్యామల దగ్గర కూర్చున్న వాళ్ళిద్దరి వైపు చూపిస్తూ అన్నాడు పెద్దాయన తన పక్కకు వచ్చి కూర్చున్న కాళిదాసు నుద్దేశించి. ఆ మాటకు బుజాలెగరేశాడు. ఇప్పుడేం చేయగలవ్ అన్నట్టు శ్యామలని కొంటెగా చూస్తూ పాపపై చేయి వేశాడు.

అంతే! ఆ చేతి స్పర్శకే నిద్దట్లోవున్న పాపాయి కేరుమంది. శ్యామల ఎంత సముదాయించిన ఏడ్పు మానలేదు. అలా పసిబిడ్డ వూరుకోదమ్మా... సిగ్గుపడతావేం పాలిచ్చేస్తే ఆడుకుంటుంది, సలహా ఇచ్చింది వృద్ధురాలు. శ్యామల గత్యంతరం లేక పైట కాస్త తొలగించి పాపాయికి చన్ను అందించింది. ఆమె ఎంత ఒదిగి కూర్చున్న కాళిదాసు ఒంగి ఒంగి తనివి తీరా చూస్తున్నాడు. నాన్నగారు మీరిద్దరూ కాస్త అలా వెళ్ళిరండి వూరికే ఈ అమ్మాయి బిడియపడిపోతోంది. కాళిదాసు చూపుల్నించి తప్పించుకోవాలని శ్యామల పడ్తున్న అవస్థ గమనించి నడివైసావిడ అంది. ఇద్దరూ లేచి ఏవో కబుర్లు చెప్పుకుంటూ ట్రెయిన్‌లోనే పచార్లు చేసారు.

బ్రతుకుజీవుడా అనుకుంది శ్యామల. ట్రెయిన్ ఎక్కిందగ్గర్నించి ఇతని వల్ల తనకు ఎదురైన పరిస్థితి ఈ ఇద్దరితో చెప్పేస్కోవాలి. ఇదేంపని అంటూ అతన్ని ముఖం వాచేట్లు చివాట్లు పెడుతుంటే చూసి ఆనందించాలి. ఓక్షణం అనుకుంది. కానీ! ఏదో బలహీనత ఆవరించి పెదవి కదపలేక పోయింది. తనేం ఒంటరిగా లేదు. ఇలా నాటకాలాడడమే తప్ప ఇతను ఏం చేయగలడు... సమాధానపరుచుకుంది. ఆ అమ్మాయి తన ఏ చర్యనీ ప్రతి ఘటించనందుకు పొంగిపోతున్నాడు కాళిదాసు. తను టిఫిన్స్ తెచ్చి పెడితే తింది. ఆపిల్ కోసిచ్చినా వద్దన లేదు. ఈ ప్రయాణం చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. కంపార్ట్‌మెంట్‌లో లైట్లు ఆపుచేసి పక్కలు సర్దుకుని ప్రయాణీకులంతా ట్రెయిన్‌లో లభ్యమయ్యే సుఖనిద్ర గురించి చర్చించుకుంటూ ఒక్కొక్కరూ నిద్రాదేవి ఒళ్ళోకి ఒరిగి పోతున్నారు. పాపాయి మాత్రం శ్యామలని పడుకోనివ్వడములేదు. తల్లి కళ్ళలోకి చూస్తూ నవ్వుతోంది. ఆమె జుట్టు పీకుతూ ఆడుతోంది. ఆ బోసినవ్వులు, ఈ కేరింతలే శ్యామల ప్రాణాలను నిలబెడుతున్నాయి. జీవితం మీద ఏ కాస్తో తీపిని కలిగిస్తున్నాయి. తనూ పాపను హత్తుకుని ముద్దాడుతోంది. ఈ అమ్మ నువ్విలా నవ్వడం కోసం ఎన్ని కష్టాలైనా ఓరుస్తుంది. ఎన్ని బాధలైనా భరిస్తుంది. పుట్టినింటా మెట్టినింటా అవమానాలూ తిరస్కారాలూ ఎన్ని ఎదురైనా ఈ అమ్మ బ్రతికున్నది నీ కోసమే తల్లీ! ఆనంద భాష్పాలు, దుఃఖాశ్రువులు కలగలుపుగా ఆమె కళ్ళనించి రాలుతున్నాయి.

హఠాత్తుగా ట్రెయిన్ ఆగింది. అది స్టేషన్ కాకపోవటంతో ఏ సందడీ లేదు. ప్రయాణీకుల గురకలు తప్పా మరే శబ్దములేదు. శ్యామల కడుపులో అలజడేదో రేగినట్టయింది.... వికారంగా అనిపించింది... వాంతి వచ్చేట్టుందే పాపాయిని ఎవరికైనా అప్పగించి టాయిలెట్‌కు వెళ్ళాల్సిందే! గాఢ నిద్రలో వున్నారంతా అనుకుందో లేదో కళ్ళముందు ప్రత్యక్ష మయ్యాడు కాళిదాసు శ్యామల ఎదురుసీట్లలో పై బెర్త్ మీద పడుకున్న అతను వొగలనిద్రలో శ్యామల తనకి తనే అతని కౌగిట్లోకి వచ్చేసినట్టు కలగని ఉలిక్కిపడి లేచాడు. నిజమవుతుందేమో అని పిచ్చి ఆశతో ఆమె సీటు దగ్గరికి వచ్చాడు. శ్యామల నెమ్మదిగా లేచి నిలబడింది అరే... కల ఎదుటే నిలిచింది. పెదవి కొరుకున్నాడు. అన్నయ్యగారూ పాపను కాస్త ఎత్తుకుంటారా? టాయిలెట్‌కు వెళ్ళివచ్చి తీసుకుంటాను. పది కొరడాలతో ఒక్కసారిగా తననెవరో బాధినట్టనిపించింది. ఆ ఒక్క సంబోధనతో తన మనసులో స్త్రీకున్న స్థానమే మారతోందా అనిపించింది. ఈ రోజు వరకు తను ఎంతోమంది ఆడపిల్లలని ఈ దృష్టితో మాత్రమే చూశాడు. అది చిలిపి తనమో, పొగరుబోతు తనమో కానీ ఏదో తృప్తి కలిగేది. ఒక్కో అమ్మాయి వల్ల ఎదురుదెబ్బలు తగిలినా మనసును తాకలేదు. కొందరు 'కంప్లైంట్' చేశారు. మరి కొందరు మందలించి వూరుకున్నారు. ఓ అమ్మాయి చెంపలు వాయించింది. ఈ అమ్మాయి తన కళ్ళు తెరిపించింది. స్త్రీ, పురుషుల మధ్య తీయని పవిత్రమైన బంధాన్ని గుర్తు చేసి తన అజ్ఞానాన్ని తరిమికొట్టింది. ఎంత మూర్ఖంగా ప్రవర్తించాడు ఇంతకాలం

తను, ఆడపిల్లలో సొగసు నీ, సొకునీ వెతికి వెతికి చూశాడు. అన్నయ్యా! అనే పిలుపుతో తనలోని పశుత్వాన్ని పారద్రోలి ఈ బంగారు చెల్లెలు. "చెల్లెమ్మా! పాప నాకు ఎంత చేరికైపోయిందో! బోసినవ్వులు ఒలకబోస్తున్న పాపాయిని శ్యామల కందించాడు. సైడు బెర్త్‌లోని ప్రయాణీకుడు ముందు స్టేషనులోనే దిగిపోవటంతో, నీతో కొన్ని మాటలు చెప్పాలని వుంది అంటూ ఆ బెర్త్ వైపుకి నడిచాడు. నిస్సంకోచంగా అతని ప్రక్కనే కూర్చుంది. తనమనస్సు గతి తప్పి అమ్మాయిలను ఎన్ని రకాలుగా వేదించినది ఆ చెల్లెలుతో చెప్పేశాడు. నువొక్కదానివి క్షమిస్తే స్త్రీ జాతంతా మన్నించినట్లే, కన్నీళ్లతో ఆమె రెండుచేతులు పట్టుకున్నాడు. వూరుకో అన్నయ్యా పొరపాటు చేయటం మానవ సహజం. చేసిన తప్పు సరిదిద్దుకుని తిరిగి చేయకపోవటమే దైవత్వం. " పశ్చాత్తాప పడుతున్నావు ఇది చాలు " ఊరడించింది.

కేవలం కొన్ని గంటల రైలు ప్రయాణీకులుగానే మనము మిగిలిపోకూడదు. ఇది నా అడ్రసు నువ్వు మా యింటికి రావాలి. అతని మామయ్య "విజిటింగ్ కార్డ్" ఇచ్చాడు. ఎలాగూ తను ఆ యింటికి ఇల్లరికపుటల్లుడు అయిపోతాడు ఈ ఇంటర్వ్యూలో ఉద్యోగం తనకే ఇస్తాడు మామయ్య అన్న ధీమాలో. మరి మీ ఇంటికి నేను రావద్దా? నీ 'అడ్రసు' చెప్పవే? అంటుండగానే ఈ దురదృష్టవంతురాలి అడ్రసు ఎక్కడని చెప్పను? ఇప్పుడో ఇంటర్వ్యూకెళుతున్నాను. భగవంతుడి దయవల్ల ఆ ఉద్యోగం కనుక నాకు వస్తే నాకంటూ ఓ గూడేర్పరుచుకుంటాను అంటూ శ్యామల తన కథ చెప్పింది. ఆ గాథలోని విషాదానికి చలించిపోయాడు కాళిదాసు తనింత వరకూ ఏ ఆడ బ్రతుకులోతులోకి తొంగి చూశాడు ?

"దారుణం!" శ్యామలా! మరీ అన్యాయం. మీ అత్తింట్లో ఒక్కరయినా అసలు మనుష్యులేనా? నువ్వు అడుగు పెట్టిన వేళ బిజినెస్‌లో నష్టం వచ్చిందంటూ ఆ నింద నీ పై వేయటమేమిటీ? ఆక్సిడెంట్‌లో మీ ఆయన పోతే "పాప పుడుతూనే తండ్రిని మింగేసిందనీ" నిన్ను పసిబిడ్డతో సహా ఇంటినుంచి గెంటెయ్యటమేమిటి? ఆవేశంగా అన్నాడు. వాళ్ళసంగతి కేమిటి? కన్నవాళ్ళే నన్ను పట్టించుకోలేదు. నీదరిద్రగొట్టు మొహాన్ని, జెష్టాదేవి లాంటి నీ కూతురుని ఇంట్లో పెట్టుకుంటే మా ఇంటి మహాలక్ష్మికి కాళ్ళు వచ్చి కదలిపోవచ్చు. యమధర్మరాజు కన్ను మా ఇళ్ళ మీద పడచ్చు. వాళ్ళకు పట్టిన దురవస్థలే మాకూ పడితే మా గతేం కావాలి? నీ దారి నువ్వు చూసుకో, అన్నయ్యలిద్దరూ తేల్చి చెప్పేసారు. వాళ్ళ మీదే ఆధారపడ్డ అమ్మానాన్న కొడుకుల కెదురుచెప్పలేదు. మరి వీళ్ళ మాట ఏమంటావు? నేను ఏకాకినన్నయ్య వెక్కిళ్ళ మధ్య అంది. ఎప్పటికీ కాదు చెల్లమ్మా నీకీ అన్నయ్య వున్నాడు. చప్పున ఆమె కళ్ళు తుడిచాడు. ఓదార్చాడు. ఇంతకీ నీ "కాల్ లెటర్" ఏదీ? ఏ అడ్రసు నుంచి ? హైదరాబాదులో మా మామయ్యకు చాలా పలుకుబడి వుంది. నీ జాబ్ కోసం మా మామయ్యనే ప్రయత్నించమంటాను. అంటూ లెటర్

చూసిన అతని మనసులో మెరుపులాంటి ఓ ఆలోచన. అయితే ఇది తనకు మామయ్య ఇప్పిస్తానన్న ఉద్యోగం. తన మాట ప్రక్కన పెట్టేస్తే మామయ్య చేత శ్యామలకే ఇప్పించవచ్చు. ఆ అమ్మాయి కష్టాలు గట్టెక్కిపోతాయి. నిజానికి ఉద్యోగం అవసరం లేని తను నాన్న ఆశలు నెరవేరుస్తూ వ్యవసాయమే చేయవచ్చు. ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

మేనల్లుడు చెప్పింది వింటూనే విశ్వనాథం ఒంటికాలుపై లేచాడు. నువ్వు చంద్రికను చేసుకుంటానని, కొడుకులు లేని నాకు ఇల్లరికపుటల్లుడవై ఆసరా అవుతానని మాటిచ్చి ఇలా ప్లేటు ఫిరాయిస్తావా? నన్నపార్థం చేసుకోకు మామయ్యా! ఈ అమ్మాయికి ఉద్యోగం ఇచ్చినంత మాత్రానా నేను నీ వాడిని కాకపోతానా? చంద్రికను చేసుకుని పువ్వుల్లో పెట్టిచూసుకుంటాను. ప్రాధేయపడ్డాడు. చంద్రిక చస్తే ఒప్పుకోదు. ఆ పల్లెటూరిలో క్షణముండదు. లేదు మామయ్యా! మా మనసులు కలిసాయి. తనని ఒప్పించి నా దారికి తెచ్చుకోగలను అన్న ఆశ నాకుంది. ఇంతవరకు ఏ అనుబంధానికి ఏ విలువుందో నేను గుర్తించ లేకపోయాను. నాన్న ఆశలు నిలువునా కూల్చి పట్నం మోజులో పడ్డాను. ఒక్క తప్పు సరిదిద్దుకునే అవకాశం నాకివ్వు. నాన్న కోరిక తీర్చి మా పొలాలనే సస్యశ్యామలం చేసుకుంటాను. చంద్రిక నాకు తప్పక సహకరిస్తుంది మామయ్యా! ఇలా ఎంతగానో నచ్చచెప్పి శ్యామలకు జీవనోపాధి కల్పించాడు. తన చెల్లెలు కాని చెల్లెలి చేతిలో పాపాయి నవ్వాలి... ఎప్పుడూ నవ్వుతూనే వుండాలి అనుకున్నాడు తృప్తిగా.

*ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసారం, మార్చి, 2003* ❑